కథానిక

# మాతృప్రసాదం

రమణశ్రీ

సముద్రమధ్య లోకంలో బడబాగ్నికిమల్లే కృష్ణవేణమ్మ జీవితమధ్యంలో తెగనిసమస్య తగిలింది. చిరకాలంనాటి ప్రేమలూ, ఆశలూ అన్నీ మట్టుబెట్టుకొని, సాంప్రదాయిక సంఘర్షణలో, తన నేదో గొప్ప చెప్పరానిఅన్యాయం గాయంలా బాధించసాగింది. పదిహేను సంవత్సరాలు శరీరం ధారవోసి, పెంచి తిండిపెట్టి బట్టపెట్టి, ఒక జీవితాన్ని తయారుచేసిన కృష్ణవేణమ్మ-ప్రసాదరావు ఎదురు తిరిగిన ఘట్టంలో, హతాశురాలై, "ఛీ! నా యింటోంచి పో! ఏనాటి రుణానుబంధమో నాకూనీకూ తీరిపోయింది! ఏతల్లి కొడుకువో నువ్వు! నేను చేతులారపెంచిన కొడుకు కానేకాదు! నే నేమానవత్వంతో నీకు తల్లి నౌతాను? నేటితో నీకూనాకూ రుణానుబంధం తీరిపోయింది" అంది.

ఆనాడు ప్రసాదరావు కన్నతల్లి కళ్ళంట నీరు కురుస్తూ, "నీ కొడుక్కిందమాచుకో కృష్ణవేణమ్మ తల్లీ! మన స్నేహానికి ప్రతిఫలంగా వీణ్ణి నీ చేతులలో పెడుతున్నా! ఒక యింటివాణ్ణిచేసే బాధ్యతను నీ కప్పగించి నిశ్చింతగా కళ్లు మూసుకుంటున్నా" అని చెప్పింది. ప్రసాదరావు ఆనాటి నుంచి తనని, "అమ్మా"అని పిలవసాగాడు.

ఆ "అమ్మా" అనే సంబోధనలోని అమృతత్వాన్ని, కృష్ణవేణమ్మ నోటితోనేగాక, చెవులతో కూడా జుర్రుకొనేది. అప్పటిప్రసాదరావు పదేళ్ళు మించని అమాయకత్వం చూడ్డానికి ముచ్చటగా వుండేవాడు. తనకిమాత్రం పిల్లలేరీ? ఏనాడోతనకీ తనభర్తకీ శాశ్వతమైన ఎడబాటుల్లో పుట్టిన ఏకాకిత్వపు గుడ్డివెన్నెల పొదలనీడల్లో, ఈ గోరంత వెలుగునూ చూచుకొని తృప్తిగా కన్నీళ్లు కార్చింది.

బంధువర్గీయుల తాడనపీడనలకీ, ఖండనమండనలకీ, విమర్శలకీ ఇతరవిధమైన చోటివ్వకుండా ఇప్పటికి ఇరవైమూడేళ్ళవాణ్ణి చేసేసరికి తను పెంచింది కాకినని తెలిసొచ్చింది. తన కోకిలభ్రమ ఎంత అప్రతిష్ఠ పాలయిందో?

ఒకప్పుడు సరిగ్గా పబ్లికు పరీక్షల్లో తనకి జబ్బుచేసినపుడు పరీక్షల్ని సహితం లెక్కచెయ్యకుండా గుక్కతిరక్కుండా సేవచేసిన ఆ ప్రసాదు ఇప్పుడేడీ? రాత్రిళ్ళనక, పగలనక మేలుకొని మాతృసేవలో పునీతుడయిన ప్రసాదు ఇప్పుడెక్కడ ఉన్నాడు? తను అన్నం తినకపోతే బలవంతంగా నోట్లో తెచ్చిపెట్టి బలవంతపెట్టే చిన్ననాటి ప్రసాదరావు సంఘటనలు జ్ఞాపకం వచ్చినపుడల్లా పులకరించేది ఒళ్ళు. స్కూలుఫైనలు ప్యాసయాక పెళ్లిచేస్తానంటే, "అమ్మా! నీకాశ్రమకలగనిస్తానా? ఎప్పుడవుతుందో అప్పుడే అవుతుంది, కంగారెందుకూ?" అన్నాడు. ఇంటరులో బి. పి. సి. గ్రూపుతీసుకొని, ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయాక, యం. బి. బి. యస్. కోర్సు అనుగుతప్పకుండా ప్యాసవుతూ వచ్చేసరికి, తన ఆనందానికి పట్టపగ్గాల్లేవు!

తన కొడుకు రేపుప్రొద్దున డాక్టరు!

ఎంత పేరు! ఎంత పేరు! కృష్ణవేణమ్మగారి కొడుకు హస్తవాసి ఎంతగొప్పదో?

తనపేరుని తన వంశఖ్యాతినీ నిలుపుతాడనుకొని బ్రహ్మాండంగా గర్వించింది. అయితే చివరి సంవత్సరంలోనే కృష్ణవేణమ్మ కొంపముంచుతూ, ఒక క్రిష్టియనుపిల్ల ప్రసాదరావు హృదయంలో ప్రవేశించింది. ప్రసాదరావు అతీతమైన సాంస్కృతిక మానవత్వం నిరాటంకంగా ఆ క్రిష్టియను పిల్లకి, ప్రణయద్వార కవాటం తెరచింది. హృదయపూర్వకంగా మానవాంతర్లీనమైన ఆ సౌందర్యజ్యోతిని, తన కడుపులో విలీనీకరణ

చేసుకోడానికి నిరభ్యంతర పెట్టింది. చీకట్లో ప్రవేశించగలిగే వెలుగుకి, వెలుగులోనే ప్రవేశించగలిగే కిరణానికి, ఉదాత్తద్విగుణీకృతత్వాలు ఎలా ఆపాదింపబడుతున్నయ్? తన విశాలమైన హృదయంలోకి, ఆ వెలుగు సౌందర్యజ్యోతి చొచ్చుకొని వస్తోంది. నిస్తమోనిబిడమైన తనకా వెలుగు ద్విగుణీకరణమే! తనలో, తన తల్లిచ్చిన అర్వాచీన సంప్రదాయమిచ్చిన సంస్కార వికారపు అలజళ్ళనుంచి, మోక్షగామియై అంతర్జాతీయమైన వైవాహిక ధర్మానికినాందీప్రస్తావన సౌదామినితో జరిగింది. తన నే క్షుత్సిత సంకుచితశక్తులూ అడ్డగించలేవనే ఉద్దేశంతోనే సౌదామినితో సంబంధము పెట్టుకొన్నాడు. ఈవిధమైనప్రోత్సాహానికి, ఏ పాశ్చాత్య సంస్కృతికారుడో కారకుడని, ఒప్పుకోక బొంకినా మనసులో ఆ అబద్ధం గింగురు పెడుతూనే వుంటుంది!

సౌదామిని జాగరూకతగా, "మీ బ్రాహ్మణ్యం మా మాల మాలినా మైలపడుతుందేమో ఆలోచించావా?" అంటె. "నేను శరీరవాదిని కాను, హృదయవాదిని-హృదయానికిలాంటి అతీతమైన శక్తి వుంటుంది. నాలో పాశ్చాత్య సంస్కృతి మత్రివూడలు, వెర్రి బ్రహ్మజముళ్ళు ప్రాకిందనుకునే వారికి ఇదే సమాధానం-మనపురాణలక్ష్య సాక్ష్యాలతో, మీ కేది తప్పనగలరు?" అని అభిప్రాయాలను వెలిబుచ్చాడు.

సౌదామిని, సౌదామనీ శరన్మేఘ పరివృతమైన కాంతి కళావారంలాగ, ఆ దిగంతవ్యాప్తమైన ఇంద్రధనస్సుకుమల్లే ప్రసాదరావుదృష్టిని కేంద్రీకరించుకొని, మెరుపులు కురిసింది-తపించే హృదయభావాలను, సంఘర్షణపడే బాటల కూడలినుంచి, ప్రసాదరావుకి సౌందర్యమార్గప్రబోధాన్ని కల్పించింది. ఎవరిలోనూ లేని ఆకర్షణ, అతీతమైనదేదో చెప్పరాని అభిమానం, సర్వస్వ హేతుపూర్వకమైన సౌదామినిలో కన్పించే నవనవ స్త్రీశిల్పం ఆమెలోకనుగొన్నాడు. కాని స్నేహమూ అభిమానమూ అన్నిటినీమించిన సాన్నిహిత్యమూ పురస్కరించుకొని, ప్రణయప్రేమ బలపడిందనటంలోనే గొప్పవిశ్వసత్యమేర్పడుతోంది. ఏనాటికైనా సౌదామిని సంస్కృతిని, కళాకాంతిని సౌందర్యాన్ని తలదన్నె వాళ్ళుండవచ్చునుగాని, ప్రసాదరావు ఏతద్భావాతీతుడననే సమాధానంతోనే సౌదామినితో ప్రణయబంధుత్వం నెరపుకొన్నాడు.

కాని, ఈ విషయంలో కృష్ణవేణమ్మ హృదయంలో అగ్నిగోళం బద్దలైంది. పూర్వం తనలో పాదుకొన్న చలిజ్వరం పెల్లుబికింది. తన ఆశలూ, ఆశయాలూ కొడుకుమీద ఆశపెట్టుకొని కట్టుకొన్న మేడలూ, గోడలూ పునాదులతో పెళ్ళగిలిపోతున్నాయే అని—ప్రాచీనంగా ఆచారాలతో కట్టుబాట్లతో బ్రతికిన తను, కులం చెడిపోయే బతుకుని, హీనాతిహీనతను ఏవిధంగానూ సమ్మతించలేదు. కొడుకు ఈ విషయాన్ని గురించి ప్రస్తావించినపుడు, చిన్నపిల్లవాణ్ణి చీవాట్లుపెట్టినట్టు సామాన్యంగా అందరూ తిట్టేతిట్లే తిట్టింది. భయపెట్టి చెప్పింది. అనాదినుంచీ వస్తూన్న బలమైన సంప్రదాయాలకి వేరుపురుగు కావద్దని నొక్కినొక్కి చెపుతూ, "ఒరేయ్! ప్రసాదం! అలా అయితే నాయింట్లో నీకింక పిడికెడు ప్రసాదం కూడా దొరకదు! ఏ అమ్మ కన్నకొడుకువో నీవు నీకునీవే, నాకు నేనే! మనమధ్య మమతలూ, మమకారాలూ సడలిపోయినట్టే!—

నీకు పాపపుబుద్ధులు పుట్టక మంచిబుద్ధులు పుడతాయా! కాకిగుడ్డుని కోకిలగుడ్డులో కలిపినా లాభమేమిటి? నీ తల్లిమాత్రం లోకోద్ధారకురాలు కాదా? నీ బ్రతుకు నడివీధిలో పారవేయలేక, నిన్ను పెంచేందుకు మాటిచ్చాను. అది చస్తూ చస్తూ నువ్వే కాపాడాలి కృష్ణవేణమ్మా! అని జబ్బుతో కుళ్ళికుళ్ళి చచ్చింది—నీ యిష్టం. నేను చెప్పవలసింది చెప్పాను. ఇరవైమూడు సంవత్సరాలు నిండిన నీకు ఏభయ్యోపడిలో నేను బోధ చేయడం వెక్కిరించినట్టేవుంటుంది. ఇప్పట్నుంచీ నీతోవ నీదీ, నాతోవ నాదీ."

ప్రసాదరావు వాదించడానికి పూనుకొని, భావాల్ని వెలిబుబుచ్చే అవకాశాలెన్నెక్కువ వున్నాయో, ఆ అవకాశాల్ని పూర్తిగా జారవిడుచుకున్నాడు. తను చేసేపని తప్పని తెలుసు, తెలియదు! కాని లోకానికిది తెలిసిచేసే తప్పే! ఈ విషయాన్ని దాచుకొనే తప్పుకాదని, వాదించాలి! వాదిస్తే, తనుఓడిపోవచ్చు ఓడకపోవచ్చు. కాని వాదించే ఇష్టం తనకి లేశమాత్రం లేకపోవ

డమే, ఆలోచించదగ్గ విషయం! కులమతాహంకారభేదాలకీ, వాదాలకీ శంఖారవాలు విజృంభిస్తున్నాను, గొప్ప సంఘోద్ధారకుణ్ణివుతాను-అనుకునే తను, సామాజికపు చూపుతో తను పట్టి గర్వపోతు, చెడుతిరుగుళ్ళు తిరిగేవాడు, కులం చెడి వెలివేయబడిన వాడు న్నూ— కాని, తనలో అంతర్వాహినీతరంగోత్తుంగమైన సంస్కృతి ప్రబోధించే ఈ సత్యం తన అంతరాత్మీయతకి, వ్యతిరేకంగా జరిగేదికాదు.

ఎవరైనా తనను, తన యెదురుగానే, “క్రిష్టియన్ దాన్ని పెళ్ళాడాడు, ఛీ! మాలదాన్ని...” అనే తుచ్ఛ విమర్శలకి గురిచేస్తే, తన నవనాడుల్లో పొంగే సంస్కార రుధిరాలు ఒక్కుమ్మడి క్రక్కదిలి పోతయ్! తను చేసిన పనికి తాత్కాలికంగా తలవంపు కలుగుతుంది. దానికి తట్టుకొని, చిరునవ్వుతో స్వీకరించగలిగినవాడే అందుకు ముందుకురావాలి. వెలి, బలి సంఘంలో అపకీర్తి ఈ పదాలకి తనే మాత్రం భయపడినా, తన నిశ్చలమైన గరిమనాభి క్రి[illegible] వంగి, పీఠావరణ దాటి పెద్ద బరువుతో నేల[illegible] పడి హృదయం శకలశకలాలై పోతుంది.

ఈ విషయంలో మిత్రుల సలహాల నిమిత్తం ప్రశ్నించినపుడు “మహాదృష్టవంతుడవోయ్”- అన్నారు చిరునవ్వునవ్వుతూ. ఆ నవ్వుల వెనకాల మానవుడు దాచలేని, అగాధాలున్నయ్యని ఎలా తెలుస్తయ్? తెలిసినా ఎలా అవగతమవుతయ్?

* • *

యం. బి. బి. యస్. డాక్టరుకోర్సు పూర్తిచేసిన తరువాత ప్రాక్టీసు మొదలుపెట్టాడు. సౌదామినికూడా తనకన్ని విధాలుగా సహకరిస్తోంది. మొదటిసంవత్సరం వైద్యమంటే తనకు విసుగేసిపోయింది. రోగులు, రోగాలు, మందులు ఇ[illegible]షన్లు చావులూ రోతలతో అలవాటుపడడం మొదలుపెట్టాడు. ఈ సంవత్సరం సౌదామిని అతనితోనే భోజనభాజనాలు విహారాలు- అంతా అతనిలో అంశమైవుంటూవచ్చింది. రెండో సంవత్సరంలో అతని చేతిలో రేఖలు మారాయి. కొత్త జీవం, కొత్త జీవితం అతనిలో తొణికిసలాడింది. ప్రజల రోగాలెక్కువవడానికి, తన ఆర్థిక ప్రాబల్యానికి ఏదో మంగళసూత్రముందని గ్రహించగలిగాడు. తన డిస్పెన్సరీలో మందులజాబితా లెక్కువయినాయ్. మిసెస్. ప్రసాద్ తనకన్ని విధాలా అందివచ్చే కాంపౌండరు!

“ప్రసాద్, సౌదామినుల దాంపత్య జీవితమెంత అన్యోన్యం?” అన్నారు వచ్చేపోయే మానవులు!

డాక్టరు ప్రసాద్ కీర్తి నలుదిక్కులా వెలుగులా పాకి వెళ్ళిపోయింది. అతన్ని వినని వాళ్ళుగాని, చూడనివాళ్ళుగాని వుండరనే అభిప్రాయంతోనే చాలామంది వుండేవాళ్లు!

కాగా, ధనవంతుల, జమీందార్ల అండ బాగా కుదిరింది. వాళ్లు ఏ రోగంవచ్చినా అతనిచేతే బాగుచేయించుకొనేవాళ్ళు! ఎన్నిరకాల ఆపరేషన్లు అతని చేతిమీదుగా జరిగాయో అతనికి జ్ఞాపకమే లేదు!

ఒక పెద్దమనిషి తనకి జయప్రదంగా జరిగిన ఆపరేషనుకి చిహ్నంగా-ఒక కారు బహూకరించాడు. పైగా డాక్టరు ప్రసాద్, ఒక పెద్ద యెత్తున బంగ్లా, దానినానుకొనే ఒక సొంత హాస్పటల్ కట్టి రోగసేవచేస్తుంటే, సర్వాంగీణ సౌకర్యమైనదాన్ని, “ప్రసాదరావు హాస్పిటల్” అని ప్రజలే నామకరణంచేశారు! అన్ని రకాల రోగజీవులు అక్కడ పొందే శాంతి-ఆర్థిక ప్రతిపత్తిమీద ఆధారపడివుంటుందనే విషయస్వార్థానికి, ప్రసాదరావు బాధ్యుడుకాడు. ఎక్కువ బిల్లుచేసి, ప్రజల్ని కొల్లగొట్టి కట్టించిన, ఈ ఐశ్వర్యపులకిత సౌధాదులు అన్యాయాకృష్టమవడానికి ప్రజలేవిధంగానూ, ముందుకురాలేరు. కారణం?- ఆయనమీద వుండే గురి! కాగా, బీదవాళ్ళమీద ప్రసాదరావుకి, కనికారాలుండవలసిన అవసరం లేదు. ఆర్థికంగా నీతిరీతి అతన్నలా శాసించింది.

* * *

రోజురోజూ అభివృద్ధివంతమై, యిప్పుడు తనూ, తనకో అసిస్టెంటూ, నర్సులూ - నౌకర్లూ- అంతా భోగోపభోగంగా జీవిస్తున్నాడు. కాని, ప్రసాదరావు-తనొక్కళ్ళచేత పెంపబడి, ఇంత అభివృద్ధి పంథాలోకి, వచ్చాననడానికి సిగ్గుపడతాడు. కాగా, ఆ సిగ్గు కొంతకాలానికి, అసహ్యంగా మారింది. కృష్ణవేణమ్మ మాట వచ్చే

సరికి,ముభావంగావుండేవాడు. మనస్పంగీకరించని, మనిషినిగురించి, మనిషి మాట్లాడడానికి వెగటు చూపెట్టే గుణం, అతనిలో స్పష్టంగా గోచరించింది- కృష్ణవేణమ్మ ఎవరూ? ఆమెనిగురించి, తనకేంకావాలి? ఎవరైనా తన పూర్వపు చుట్టమని పేరుపెట్టుకొని వస్తే, ఇంత పిండాకూడు పెయ్యగలడు. అంతే! తన బంధువులకి, చేయగలిగే పనుల్లో అదొక గొప్పది! అయితే, "ప్రసాదరావు హాస్పిటల్" తన కొడుకిది, అని చెప్పుకొనే గర్వాన్ని కృష్ణవేణమ్మ ఏవిధంగానూ ప్రసాదునించి పొందలేదు.

పరిస్థితుల ప్రాబల్యంతో తన పని బాగా సాగుతోంది. అక్కడ వేరే గవర్నమెంటు హాస్పిటల్ లేకపోవడంతో, రోగుల రోగాలు త్వరలోనయమవుతాయనే ఆశతో—ప్రసాదరావు బలపడసాగాడు. ఇంకా స్పెషల్‌గా ఆపరేషన్‌లకి, పది పదిహేనుసార్లు పొరుగూళ్ళకి వెళ్ళివచ్చాడు. ఇప్పుడు పొరుగూరి కేసులే ఎక్కువ! ప్రతీవ్యక్తి రోగంతో మృత్యువుతో నిరంతరపోరాటం సాగించదలుచుకున్నాడు.

ఇక హాస్పిటలంతా సౌదామిని స్వాధీనంలోనే వుండేది. అసిస్టెంటు డాక్టరు రమేశ్‌చంద్ర సర్కారు తెలుగువాడే! అప్పుడప్పుడు ప్రసాదు లేనపుడు-ఇద్దరూ కలిసే, రోగలోకాన్ని పరిపాలించేవారు. ఇష్టంవచ్చినట్టు జులుంసాగించేవారు.

సౌదామినికి రానురాను ప్రసాద్ ప్రవర్తన దుర్భరమైపోయింది. వేళకురాడు, తినడు, కట్టడు, పడుకోడు. అతని వేళలు వేరు. నిమిషాలు వేరు. ఘడియలు వేరు. నిద్రసమయాలువేరు. ఎప్పుడూ, రోగులూ, ఇంజెక్షన్లు, మందులూ మశానాలతో సతమతమైపోయి, తేల్గ్గా ఊపిరి పీల్చుకోలేని, ప్రసాదు సాంగత్యంలో తనకేదో లోటు కనిపించసాగింది. తను అడవిగాచిన వెన్నెలైపోతున్నానేమో, అని భయపడింది. తలలో మెదిలే కోర్కెలకి బాధ్యులెవరూ? తనలో రేపే ఆశలకి అధినాథులెవరూ? వెతుక్కోసాగింది. ప్రసాదరావు నీరసపు నీడలో కనిపించాడు. హృద్దర్పణం మీద మసకగాపడ్డాడు. సౌదామిని భరించలేకపోయింది.

రాత్రి పన్నెండుగంటలకి, ప్రసాదు పొరుగూరు వెళ్ళి వచ్చాడు. సౌదామినికి కళ్ళు జ్యోతుల్లా వెలుగుతున్నయ్! పక్కమీద పడుకొని వేగుతూ దొరులుతోంది. ప్రసాద్ పిలిచాడు. కళ్లు మండుతూవుంటే, వెళ్ళి తలుపు తీసింది— "ప్రసాద్"—

"అవును నేనే!"

నువ్వుకాదు ప్రసాద్‌వి నువ్వుకాదు— నీలో ధనపిశాచాహంకారనర్తనోద్వేల్లమైన విపరీత రాక్షసశక్తి ఆవేశించి పీడిస్తున్నది—రోగాలు, రోగులూ మందులూ, మాకులూ—ఇవే నీకు సర్వస్వం—అంటూ, ఆమె మనస్సు పురికొల్పింది. తన కంఠం కోపంతో రుద్ధమవుతోంది. ఏదో అనేయాలనే ఆవేదన!

"ప్రసాద్! నువ్వు కొంతకాలం ప్రాక్టీసు మానేయకూడదూ? ఇంత మితిమీరితే ఆరోగ్యం పాడవదూ? డాక్టర్లుకూడా మనుషులూ, రోగులూనూ! మీరేం దేవదత్త శక్తిస్వరూపులు కారు!"

"నా ఆరోగ్యానికి బాధ్యత నాది! నన్ను పెంచిన తల్లికూడా ఇలాగే అనేది. రాత్రిళ్లు ఎడతెరిపిలేకుండా మార్కులకోసం చదువుతుంటే నన్ను వారించేది. ఇప్పుడు డబ్బుకోసం! జీవితంకోసం... డాక్టరు ప్యాసయ్యాను. రోగులు రక్షిస్తే నేనే దేవుణ్ణనుకొని, నా ఆర్థికపు కోరికల్ని తీర్చేస్తారు! ఈ బంగ్లా, గార్డెను, కారు, నీ మెళ్ళో రవ్వల నెక్లెసూ అవన్నీ ఎక్కణ్ణుంచి ఊడిపడ్డయ్?"

సౌదామిని మనస్సు దాహంతో నిండింది. ఒకభాగం పూర్తిగా కరిగిపోయింది. ఒకవైపు కరడుగట్టిపోయింది. రక్తపు సారం ఆగింది. నాళాలు తెగిపోతున్నయ్! కోర్కెలు ప్రేళ్ళురుకుతున్నయ్!

ప్రసాదరావు అలసటగా నిద్రపోతున్నాడు. లేపేటంత స్త్రీత్వంలేక టెక్కామీద ...ం అన్ని, "ఎరక్కపోయి, ఈ గోతిలో ఎందుకు దిగానా?" అని అనుకొంది.

మళ్ళీ ప్రొద్దు పొడిచేసరికి-ఎవరో పరుగెత్తుకుని వచ్చేసరికి - తన చేతులారా ప్రాణాల్ని రక్షించడానికి, పరుగుత్తుకుని వెళ్ళాడు. సౌదామిని కాంపౌండులోంచి కారు జోరుగాపోవడం

చూచి, నిట్టూర్పు విడిచింది. ఇదివరకెప్పుడూ, ఆమె హృదయంలో పొడసూపని మథన ప్రారంభమైంది. ఇంతవరకూ గడచినరోజులు పీడకలల తెరల్లా వేధించసాగినయ్! వెళ్ళి గదిలో కుర్చీలో కూలబడింది. ఒక్క నిమిషంకూడా కూర్చోలేదు. లేచింది. మందుసీసాలదగ్గరకెళ్ళింది. ఖాళీ ససాల్ని తీసి, వేస్ట్‌బాస్కెట్‌లో పారవేసింది.

బూటు చప్పుడు వినిపించింది. అసిస్టెంటు డాక్టరు!

"హల్లో! మీరిక్కడున్నారా?"

సౌదామినికి కర్ణకఠోరంగా వినిపించింది. ఆ కంఠం, దర్జాగా బ్యాండ్ వాయించినట్టుంది. సన్నగా, మనసు లోతుల ఒరల్లో గింగురులెత్తి శ్రావ్యంగా మధురంగా వినిపించసాగింది.

"క్వయినా మిక్చరు లేదా?"

"ఏవీలేవు. చేస్తారా?"—అంది.

"ఆఁ"అంటూ రమేశచంద్ర సర్కారు బల్ల ముందు నిలబడ్డాడు.

"ప్రసాదెక్కడికెళ్ళాడో మీకు తెలుసా?"

సౌదామినికి, ప్రసాద నేసరికి, ఏదో భయంగాని, భయంపట్టుకుంది. అతని పేరు వినేసరికి, ఊహ చెదురుతుంది. "ఊహూఁ" అంది. కాని, తన చూపులన్నీ సర్కారువైపే తిరిగితిరిగి, తిప్పి తిప్పి, పరీక్షగా చూస్తోన్నట్టు కనిపెట్టింది— "పేషెంట్సునందరినీ విజిట్ చేశారా? లేకపోతే నే వెళ్ళేదా?"

"మీ కాశ్రమెందుకమ్మా!" సర్కార్ నవ్వాడు. అతని నవ్వు అదోలా అనిపించింది. తనని వెక్కిరించినట్టు అభినివేశించింది. అయితే కొంతసేపటికి, ఎక్కడో గుండెలోతుల్లోంచి, పదిగంటలు గాలికి కదలి, ఏకనాదంగా పరివర్తనమైనట్టు-తరంగాలు హోరుగా నురుపులురలుకుంటూ వెనక్కి [illegible]త్తి సముద్రంలోకి ముడుచుకొన్నట్టు దేవాలయం తలుపులు వేసేస్తుంటే చిరుగంటలు మ్రోగినట్టు- ఆ నవ్వు తనకి వినిపించింది. అతను నవ్వడం మానివేశాడు. తను చూడపూనుకొంది. చూడకూడదనుకొంది. తన చూపులు తన మాటలు వినకండా, తనకి తెలీకండా ఎవర్నో ఎందుకో చూస్తూన్నయ్. ఎందుకు చూస్తున్నయ్? చూచినందువల్ల కలిగే తృప్తికి బాధ్యతవహించేదెవరూ?...

"ఒకసారి యింటికి వెళ్ళిరావాలి!"

సర్కారు, సౌదామినిని ఆలోచనలోనించి, మేలుకొన్నాడు. తనవైపు పరీక్షగా చూస్తూండడం కనిపెట్టాడు. తనకాశ్చర్యం కలిగింది. "ఒకసారి ఇంటికి వెళ్ళొస్తానమ్మా!"— 'అమ్మా!' ప్రయోగం తనకి వింతగొలిపింది. సౌదామినికి నవ్వు తెప్పించిన, ఆ ప్రయోగంలోవుండే అందం, ఆడవాళ్ళందరికీ తెలుసు.

సౌదామిని నవ్వింది.—ఎన్నో తనవెనకాల అగాధాలు సృష్టించుకొంటూ లోయలసానువుల్లో మారుమ్రోగిన నవ్వునవ్వింది. ఆ నవ్వు సర్కారు కర్థంకాక తికమక పడ్డాడు.

"అంత టీడియస్‌గా వున్నారేం? మీవంట్లో నలతతావుందా?"

"లేదు!"—అంది. చెయ్యిచూడమని అందించింది. సౌదామిని మృదులహస్తాన్ని అందుకొన్నాడు. "నాడిలో దోషంకనిపించదే"అన్నాడు. ఆమెశరీరం ఎందుకోగాని దహించుకుపోతున్నట్టు కనిపెట్టాడు. హృదయంలో త్రేతాగ్నులు చిమ్ముతూన్నట్టు భావించుకొన్నాడు. చేతిని చేతుల్లో ఐదునిమిషాలుంచుకొన్నాడు. సౌదామినికూడా చెయ్యి వెనక్కులాక్కోడానికి పూనుకోలేదు.

"ప్రసాద్ మృత్యువుతో పోరాడుతున్నాడు. ఒకరోగి రోగాన్ని నయంచేయడానికి వెళ్ళాడు. మృత్యువునే జయిస్తాడేమో?"—అన్నాడు వెళ్ళిపోతూ.

సౌదామినికి అప్రయత్నంగా తోచింది. ప్రసాద్ మృత్యువుని జయిస్తాడని. మృత్యువు ప్రసాద్ మీద పగతీర్చుకుంటుందని!

* * *

సంజనీరెండ పొడల ఎరుపుచాయలు, ఎర్రని రక్తవస్త్రాల్లా సాగిపోతున్నయ్! సూర్యుడు కమ్మరి కొలిమిలో ఎర్రగా మండుతున్నాడు. సౌదామిని అనుకుంది—సంధ్య విరహిణీముఖంలా ఎర్రగా మండుతోందని.

తనేదో కావ్యంలో చదివినగీతం జ్ఞాపకానికొచ్చింది—

దూరమున మండుచున్నది తీరరేఖ
సాంధ్యవిరహిణిగుండె రక్తాంధ్యకేలి
కాసహస్రమ్ము లెడబాటు కాక రగుల-
చీకటితెరలు త్వరలో పరాకు దెలియు!

కనుచీకటి పడుతోండేటపుడు ప్రసాద్ వచ్చాడు. ఏవోమందులు తీసుకుని మరణశయ్యమీదవున్న రోగిని రక్షించడానికి పరుగెత్తుకెళ్ళాడు. సౌదామిని అడ్డింది. కాని ప్రసాద్ "ఈరోగి బ్రతికితే మనసమస్యలన్నీ తీరిపోతయ్! నీమెళ్ళో రవ్వల నెక్లస్"—

సౌదామిని కళ్ళల్లో మేఘాలు గిరగిర తిరుగుతూ నెత్తురు ఎర్రగా గడ్డకట్టింది. 'ఇదంతా నాకోసమా?' అనే ప్రశ్న మెదట్లో నీటినించి గట్టుమీదపడ్డ చేపలాగ రెక్కలు రెపరెపకొట్టుకొంది.

వెనకాలినించి ఎవరో తనభుజాల్ని చెయ్యివేశారు. వెనక్కి తిరిగింది. సర్కార్! "మీరు దిగులుపడకండి! రోగి బ్రతుకుతుంది. ఆయన వస్తారు! మీకు బహుమానం తెస్తారు"అన్నాడు.

సౌదామిని ముభావంగా ఏం మాట్లాడకండా మూగజీవంలా నిల్చునివుంది. సర్కార్ మెల్లిగా భుజాల్ని తడుతూ, "అలా వెళ్ళివద్దాం రండి! స్వేచ్ఛావాయువు పీలిస్తేగాని, మీలో అలజడి పోదు"—

సౌదామిని అతన్ననుసరించింది మారు మాటాడకుండా. గుర్రపుసార్టు బజారుదాటింది. వీధులుదాటింది. అలాఅలా తిరిగింది. తిరుగుతోంది. సర్కార్ వుత్సాహంగా కబుర్లు చెపుతున్నాడు. మధ్యమధ్య తనశరీరాన్ని ఆమెశరీరానికి చేరవేస్తున్నాడు. నవ్వాడు. తనూనవ్వింది. ఏదో వికారచేష్ట చేయబోయాడు. తనువారించలేదు. అతనితో ఉత్సాహం తెచ్చిపెట్టుకొని, అనేకవిషయాలు మాట్లాడింది. రసవంతమైన, ఆనందాస్పదమైనసంభాషణఇద్దరిమధ్యాకాలాన్ని కొలిచివేసింది. నిమిషాలయినయ్. గంటలయినయ్. సినిమా చూదామా అనుకొన్నారు. 'ఓ' అంది.

అనుకోవడమే తడవుగా గుర్రపుసార్ట్ సినిమాదారి పట్టింది హాల్లో బాల్కనీకి ఎక్కారు జంటుగా—సర్కార్ తనని ప్రతివిషయంలోనూ ఉత్సాహభరితురాల్ని చేస్తున్నాడు. తనలో అక్రమిస్తోన్న స్థానంలో అతను విస్పష్టంగా గోచరించసాగాడు. ఆమెమనసు తనయిష్టంవచ్చినట్టు చేయడానికి ఒప్పుకున్నట్టు తోచింది. పూర్వం ప్రసాద్‌ని ప్రేమించి, మించి అతనే తనవాడనుకోడం తప్పనిపించింది. పాశ్చాత్యదేశాల.సంస్కృతిని తను చూడకపోయినా, తనలో తనకే ఎవరో ప్రవేశపెట్టినట్టు తోచింది. తను కాలేజీలో ప్రసాద్‌తో చదువుకొనేటప్పుడు ఒకయూరోపియన్ ప్రొఫెసరుండేవాడు. ఆయన ఒక తెలుగమ్మాయితో సంబంధం పెట్టుకొన్నాడు. ఆ అమ్మాయి ఎర్రగా యూరోపియన్ మాదిరే వుండేది. అలాగే డ్రెస్ చేసుకొనేది. ఆయన ఆ అమ్మాయితో రెండేళ్ళున్నాడు. తర్వాతవిడాకులిచ్చి, ఒకయూరోపియన్ను లేడీని తెచ్చిపెట్టుకొన్నాడు. ఇంతకీ అది ఆ అమ్మాయిమీద అనుమానంతోనే!—ఆ అనుమానమే ఆ అమ్మాయి జీవితం నాశనం చేసిందనడానికెటువంటి సందేహంలేదు.

సౌదామినికి ఈ సంఘటన జ్ఞాపకం వచ్చింది. అయితే ఆ అమ్మాయికీ తనకీ పోలికల్లేవుగా!

సినిమా అనంతరం సార్ట్‌మీద డిస్పెన్సరీకి చేరుకొనేసరికి పన్నెండున్నరపైన అయింది.

"పైన పక్క సిద్ధంచేస్తా! ఈ అర్థరాత్రి మీరెక్కడి కెడతారు? ఇక్కడే పడుకోండి"—

సౌదామిని ఆతిథ్యానికి సర్కార్ ఉప్పొంగిపోయాడు. చెలియలికట్ట దాటి వస్తూన్న సముద్రాన్ని తాను హాయిగా ఎదుర్కొంటున్నాడు. హృదయసముద్రం లోతులు తెలీవనీ, అబద్ధమాడి తప్పించుకొంటారుగాని, లోతులు తెలీకపోవడమే?—సర్కార్‌కి సౌదామిని పూర్తిగా అర్థంకాజొచ్చింది.

ఇద్దరూ విశ్రాంతి తీసుకోబోతుండేసరికి మూడు ఠంగుఠంగున వినపడింది.

* * *

మర్నాడు పొద్దున ఎనిమిది గంటలకి సౌదామినిలేచేసరికి తనగదిలోగాని, అవతలగదిలోగాని, ఎవరూలేరు. రాత్రి వెలిగించిన ఎలక్ట్రిక్ షెడ్ లాంప్, అలసిపోయిన ముఖంలావుంది. ఆర్పేసి, పై అంతస్థునించి, క్రిందికి చూచింది. మామూలుగా రోగులూ, జనంవచ్చిపోతున్నారు. వసంత

వాయువుల చల్లని కనుచూపుల్లో తన మనస్సు తేలిపోతోంది. గడిచిన రేయిలో అనుభవించిన హాయి, ఆనందంగా తలపుల వలపుల్లో ఊతగొడు తోంది. తను చేసింది తప్పని ఎవరైనా అన గలరా?—అంతరాత్మహితాన్ని పురస్కరించు కొన్న తన అనుభూతి పతనావస్థనుదాటి మాన వుల అంతస్థుల్లో ఉన్మీలనమైన జీవనాదాన్ని అందిస్తోంది. అభిరుచుల మార్పులకి తలవొగ్గలేని మానవులేంమానవులు? ఎప్పుడూ సంకుచితత్వంలో రంకులరాట్నంమల్లే తిరిగేవాళ్లు ఎంతఅసహ్యంగా కదలికలేని యంత్రాల్లా కూపమండూకాల్లా కడుపే కైలాసం, ఇల్లే వైకుంఠం అనుకునే జీవు లకి, అభ్యుదయం ఏమూలనొరుకుతుంది? వాళ్ళు శపింపబడ్డారు—తాను శాపంనుంచి విముక్తి చెందింది. తను ఒకరిదగ్గర అధికారపూర్వకంగా పొందగలిగినదాన్ని మరొకరిదగ్గర హృదయ పూర్వకంగా పొందగలిగింది.

"ప్రసాద్! నేను నీదానినే! అయితే, నీవు నావాడివికావు! మనమధ్య ఎవరో దుర్మార్గులు అడ్డుగోడలు కడుతున్నారు. ఈ అడ్డుగోడల నిర్మాణంలో మనం వేరైపోతాం. విశ్వవిద్యోతక మైన స్నేహప్రణయాలకీ, అంతర్జాతీయమైన కులమతాహంకార ప్రహారానికీ తిరిగి—మార్పు తీసుకొస్తున్నాను. మాతృత్వాన్ని ఎదిరించి శ్రేయోభావంతో నాతోజీవితాన్ని వాంఛించిన నీవు నన్నిప్పుడు క్షమించేందుకు ముందుకు రాగలవా? ఆనాటి నీ వైశాల్యాన్ని ఈనాడూ నీవెందుకు చూపలేవు? నేను భ్రాంతిపడిన జలా శయాలు, విరుద్ధమైన మృగతృష్ణలైతే నేనేం చేయాలో కర్తవ్యాన్ని ఉపదేశించ గలిగే నీవు నన్ను పాపకూటంనించి పైకిలాగగలవా? ఏమో!"

క్రిందినించి ఎవరోపిలిసినట్టు వినిపించి మెల్లిగా లుముకొంటూ ముఖాన్ని తుడుచుకొంటూ సౌదామిని మెట్లుదిగి వెళ్లింది. ప్రసాద్ కుర్చీలో కూర్చొని ఒక స్త్రీరోగి స్టెతోస్కోపుతో పరీక్ష చేస్తున్నాడు. ప్రసాద్ ముఖం అదోలావుంది. ఇదివరకటి కళలన్నీ మాసిపోతున్నట్టు కనిపిస్తోంది. రాత్రినిద్రలేని అతనికళ్ళు జేగురుపూసిన మెత్తల మల్లే వున్నయ్! నీరసంగావున్నా రోగుల్ని పరీక్షిస్తూ చీటీలు రాసిస్తున్నాడు.

మధ్యలో ఎవరూ రానందుకు విసుక్కుం టున్నాడు. అతని విసుగంతా సౌదామినిమీదా, సర్కారుమీదా. 'సౌదామినీ!' అని గట్టిగా కేక వేశాడు. హాలు దద్దరిల్లింది.

సౌదామిని తెరవెనకనించి పరుగెత్తి లోపలికి పారిపోయింది. త్వరత్వరగా డ్రెస్సువేసుకుని, ఆషామాషీగా ముఖం కడిగి బయల్దేరి వచ్చింది. అగ్నిగుండమై పోతున్నాడు ప్రసాద్. సౌదా మిని ముఖం చూసి ముడుచుకొన్నాడు. వచ్చిన రోగులంతా మందులుతీసుకుని వెళ్ళిపోతున్నారు. ప్రసాద్ సౌదామిని దగ్గరకువచ్చి, "మెళకువ రాలేదా? రాత్రిరోగి బ్రతికింది. మృత్యువుని జయించాను" అన్నాడు. ఇంకా విదో మాట్లాడు తున్నాడు. సౌదామినికివేం వినిపించడంలేదు. అతను మాట్లాడేది పైశాచిక భాషగా వినిపించ సాగింది. తనసౌఖ్యాన్నీ, జీవితాన్నీ దూరం చేస్తున్న మాటలుగా వున్నయ్.

ఇక విధిలేనట్టు ముఖంత్రిప్పి, ప్రసాద్ని తీక్షణంగా చూచింది. "మీ ఆరోగ్యం చెడింది. నీరసంగా అలావుంటే నేను చూడలేను" అంది.

"చూదువుగానిలే!" అంటూ ప్రసాద్ కుర్చీలో కూలబడ్డాడు. దూరంలో ప్రసాద్ సర్కార్ రాకని గమనించి "ఓహో! సర్కారువారా? మెళుకువరాలేదా?"—అన్నాడు.

సర్కార్ పెదవి విప్పలేదు పెదవి విప్పితే ఏం ప్రమాదమో? అని. ప్రసాద్ పదిగంటలకి కారుమీద బయల్దేరి వెళ్ళిపోతోంటే సౌదామినీ సర్కార్లు బరువుగా నిట్టూర్పు విడిచారు.

* * *

ప్రసాద్ ఆరోగ్యం పూర్తిగా భంగమైంది. వారంరోజులకిగాని ఆ జబ్బుకి అంతుచిక్కలేదు. డాక్టరయితేమాత్రం రోగాలు జాలిపడవలసిన అవసరంలేదు! మానవులైనా దేవతలైనా రాక్షసు లైనా, ఏలోకవాసులైనా ఎవరికైనా భయపడ వలసివుంటే అది ఒక్క మృత్యువుకే!

ప్రసాద్ రోగానికి భయపడేవాడుకాడు. తనలో ప్రవేశించిన రోగం తనకి తెలియనిదికా దనుకున్నాడు. తనలో తనకే తెలీని అలసటవల్ల నిర్విశ్రాంతివల్ల రోగం మానసికంగా శారీరకంగా జనించింది. రోగి కావడంతోనే, అందరికీ అలుసై

పోయాడు. రోగాన్ని తాను విశ్రాంతి లేకుండా బాగా బలపెట్టాడు. అదే ఇప్పుడు మహమ్మారి స్వరూపంలో తన జీవితాన్ని ఆటంకపరుస్తోంది.

నెల రోజులు బయటికి, కదల్లేదు. ఇంట్లోనే తనకి, తెలిసిన మందులు వాడడం సాగించాడు. ప్రసాదరావు తన హాస్పిటల్లోనే ఒక రోగి! రోజులు గడిచినా, తన జబ్బు మళ్లు ముఖం పట్టలేదు. ఆ రోగం అంతు తనే కనిపెట్టలేకపోయాడు. అన్నిరకాల భయంకరమైన రోగాలు తనమీద ఒకటిగా కక్షగట్టి పగ సాధించాలని పూనుకున్నట్టున్నయ్! ఒక భయంకరస్వరూపంగా అతనిలో విజృంభించసాగినై! రోజుకి రోజు అతనిలో రక్తం ఇగిరిపోతోంది. మనిషి తేలికైపోయాడు. తను మరొకళ్ళ సలహా తీసుకోవచ్చు. అది తలవంపనిపించింది. అందుకే ఎవరితోనూ చెప్పకుండా తనకుతానై మందు తీసుకుంటున్నాడు.

ఒకనాడెవరో ఆగంతకుడు వచ్చి, తన స్థితికి జాలిపడ్డాడు. తన ఈ స్థితికి, బయటివాళ్ళెంత తపించిపోతున్నారో చెప్పలేనన్నాడు ప్రసాద్‌ని గురించి, అన్ని విషయాలూ పొగిడిపొగిడి—కృష్ణవేణమ్మ ప్రస్తావన తీసుకొచ్చాడు. ఆ విషయం వచ్చినప్పుడు ప్రసాదరావు ముఖం ఎఱ్ఱగా మండి, నల్లగా మాడిపోయింది.

ప్రసంగాన్ని అటువైపు మళ్ళించడానికి, అయిష్టపడుతూ "ఆవిడెక్కడున్నారూ?" అన్నాడు.

ఆగంతకుడు జవాబు చెప్పడానికి ఉత్సహించాడు. "విశాఖపట్నంలో." ప్రసాద్ "పిచ్చాసుపత్రిలో కాదుగదా?" అనుకొన్నాడు.

"ఆవిడిప్పుడు మరో అమ్మాయిని పెంచుతోంది. అమ్మాయి కాలేజీలో డాక్టరు కోర్సే చదువుతోంది. తెలివైన పిల్ల. తల్లి గీచిన గీటు దాటదు. అమ్మాయింక, చదవనన్నా సరే డాక్టరు కోర్సు బలవంతాన చదివిస్తోంది."

ప్రసాద్‌కి, సంభాషణ వినాలనే కాంక్ష బలిసింది. తను, ఆమె పెంపకంలో ఆమె అభిప్రాయానికి వ్యతిరేకంగా సంచరించి, ఆమె బ్రతుక్కి గొడ్డలి పెట్టుపెట్టాడు—ఆమెని చూసి, తను ఏ పది సంవత్సరాలో అయింది. ఏవిధంగానూ ఆమె ఋణం తీర్చుకోలేదు. అందుకు కృతఘ్నుడైన తనకి పుట్టగతు లుండవని, హిందూ ధర్మశాస్త్రం భయపెడుతోంది. అప్పటి తన ప్రవర్తన సాంఘిక సంస్కారానికి అభ్యుదయవాదుల పంథాకి, వెలుగు ప్రసరించిందని, భావించుకొన్నాడు.

ఇప్పుడు తనకి పోటీగా, ఆ కృష్ణవేణమ్మ మరో స్త్రీ వ్యక్తి జీవిత భారాన్ని నెత్తిన వేసుకుంది. ఆమె ఈ విషయానికి కట్టుబడి మరింత అధఃపతనమైంది—ఆ కాలేజీలో చదివే పిల్ల ఈమె నేవిధంగా భరిస్తుంది? ఉన్న ఆస్తి కాస్తా హారతికర్పూరంలా హరించుకుపోయేక, ఏ దేవుణ్ణి మొక్కుతుంది?

"చాలా పొరపాటు చేస్తోంది కృష్ణవేణమ్మ నన్ను పెంచుకుని ఇదివరలోనే చాలా నష్టపోయింది. ఇప్పుడింకా..."

అనబోతుంటే పెద్దమనిషి నవ్వుతూ, "ఆ అమ్మాయి మా బంధువే," అన్నాడు.

"కావచ్చు! మీ అమ్మాయే కావచ్చు, ఏ విధంగానూ లాభంలేదని చెప్పండి"—అన్నాడు ప్రసాదరావు అతను సెలవు తీసికొని వెళ్ళిపోతోంటే, "ఈ పూట ఇక్కడ భోంచేసి వెళ్ళండి"—అన్నాడు నీరసంగా, ఆ భోజనం పెట్టడం తన అధీనంలో లేనట్టు. ఆగంతకుడు నవ్వాడు. ఆ నవ్వులో అర్థాన్ని గ్రహించేటంత శక్తి ప్రసాదరావులో మృగ్యమైపోయింది.

మరో డాక్టర్ని పిలిపించి నయంచేయించుకోడానికి ప్రసాదరావు ఏ విధంగానూ సమ్మతించలేదు. సౌదామని, ఎప్పుడో ఒకసారి చూచి తిరిగి వెళ్ళిపోయేది. ప్రసాదరావు దృష్టి లేకపోవడంవల్ల, హాస్పిటల్, పరిస్థితుల్నించి మార్పులోకి తప్పించుకొంది చాలా క్షీణ దశలోకి వచ్చింది. రోగులు తగ్గిపోయారు. హాస్పిటల్ రా[illegible] తగ్గిపోయింది. దానితో ప్రసాదరావు పే[illegible] అతన్ని గురించి ప్రసంగించటంలో ప్రజానీకం మార్పులు తీసుకొచ్చింది.

సర్కార్, సౌదామినీ రేఖామేఘపథాంతరాల్లో స్వేచ్ఛగా విహరించసాగారు. అడ్డూ, ఆపూ లేని, సరిహద్దులేని స్వేచ్ఛ ఇద్దరిమధ్యా పెనవేసుకున్న త్రాళ్ళలో పురిబిగిసి, బిగిసిపోతున్నది.

రోగలోకంలోవున్న ప్రసాదరావు జీవితం మోక్ష పంథాలో పరిభ్రమిస్తున్నది!

కృష్ణవేణమ్మ హృదయంలో ఒకానొకనాడు దావాగ్ని రగిలించిపోయిన, ప్రసాదరావు రోగ గహ్వరంలో మృత్యు ముఖంలో వున్నాడనే సరికి, ఆమె సర్వనాడులూ కంపించినయ్! ఆపాదమస్తకం మానవత్వం దహించుకపోయింది. తనని తిరస్కరించినా ఒకనాడతను తన కొడుకుగా బ్రతికాడు. అతని జీవిత మాధుర్యాన్నే సంపదౌన్నత్యాన్నే తను ఆభిలషించింది. ఆ స్థితిలో ప్రజల్లో పలుకుబడి సంపాదించుకున్న విషయ సంగ్రహాన్ని విని, తృప్తిపడింది——కాని ఆమెలో పగ, పొగలాగ వ్యాపించి, అతన్ని దహించివేసే వుద్దేశంలో ప్రబలుతోందని గట్టిగా అనలేం! ఏ మూల త్రాచు బుసగొట్టినా పుట్టమీద చేయి వేయవచ్చు! ఏది ఎలాగైనా, తన కొడుక్కిందే చెలామణి అయ్యాడు. చింతచెట్టు నీడలో పెరిగిన గంధపుచెట్టుకి మంచి పేరొస్తోందని ఉబలాటు

కాని మృత్యువు సహించలేకపోతోందనే సరికి, తనలో ఏదో ప్రాచీనమైన, అనిర్వాచ్యమైన మమతల మేల్కొలుపులు, గుండెలోతుల్లో వినిపిస్తున్నయ్! ఎంతయినా, చిన్నతనపు పెంచిన ప్రేమ! తనలో కర్తవ్యం ఉపదేశిస్తోంది. వృద్ధాప్యంలో ఒక్కసారి వెళ్ళి ప్రసాదరావుని కళ్లారా చూడాలనే ఆకాంక్ష బాగా పురికొల్పింది. తన పోషణలో పెరుగుతూ, కాలేజీలో చదువుతూన్న నారాయణికి, ఈ విషయం వివరించింది. నారాయణి తన సమ్మతినీ, ఉత్సాహాన్నీ ప్రకటించింది.

నారాయణి దిక్కులేని దరిద్ర కుటుంబంలో పుట్టి పెరిగిందేకావచ్చు! కాని రెక్కలు విప్పుకొన్న అదృష్టం కృష్ణవేణమ్మ పాదాల ముందు 'దేహీ' అని వ్రాలింది. నారాయణి గుణగుణాల్ని విని, కృష్ణవేణమ్మ చేతులు చాచి, దగ్గరకి లాక్కుంది. తను ఒక్కగానొక్క జీవికి, తోడునీడెవరున్నారు?——తను ఒంటరిగా బ్రతకలేననుకునే ఒకళ్ళని చేరదీసింది. ఒకనాడు పడిన నీడ స్వతంత్రంగా నిష్క్రమించింది. ఈనాడు తన పాదాలముందు వంగుతోన్న నారాయణి, తన జీవితాధ్యాయంలో గొప్ప రచనా శిల్పాన్ని సృష్టిస్తుంది.

తల్లీ కూతుళ్ళిద్దరూ, ప్రసాదరావుని చూడ్డానికి బయల్దేరి వెళ్ళారు.

ఏనాడైనా, వినడమేగాని, చూడని కృష్ణవేణమ్మ ఆ హాస్పిటల్ వైభోగాన్ని చూచి విస్మయంలో గిలగిల కొట్టుకుంది-నిండా ఆవరించిన ముళ్ళ గులాబీతోట, వాటర్ స్ప్రింగులు కళ్ళకి ప్రకృతి సౌందర్యపు పొరల్ని కప్పుతున్నయ్! చీకటి నలుపుల్ని చీల్చుకొని, సారంగం త్రవ్వే కిరణంవలె, మార్గుని హృదయతాత్వికతకి మెరిసే వివేకంలా తన కొడుకుతో దెబ్బలాడి, ఎందుకు విడిపోయానా? అని మథనపడింది. అనవసరంగా లేనిపోని, సంప్రదాయాల బరువుని మోసుకుంటూ చీల్చవలసిన రేకుల్ని అట్టేపెట్టి-తనలో నూత్నంగా పోషించబడవలసిన సౌందర్యాన్నీ, దృగంత పాత చంద్రికా స్ఫురత్పథాల్ని నడవలేక విడవవలసిన దౌర్బల్యానికి నొచ్చుకొంది——

నారాయణి తన పాత అన్నగారి వైభవాన్ని కళ్లు తెరిచి చూచింది. కళ్లు మూసుకు చూసింది. తనూ——డాక్టరు కోర్సు చదివి ఇంతదాన్ని కావాలనే ఆశ శంపాప్రభలాగ మెరిసి, తన మాతృదేవతా సాన్నిధ్యాన్ని కృతజ్ఞతాపుంజీభూత కాంతి నేత్రాలతో పరికించింది.

తల్లీ కూతుళ్ళిద్దరూ లోనికి ప్రవేశపెట్టబడ్డారు. ప్రసాదరావు అలాగె నీరసంలో క్రుంగి పడివున్నాడు. చచ్చిపోవాలనే కోర్కెతోవున్న వ్యక్తిలా ఏమాత్ర లక్ష్యరహితుడై పడివున్నాడు.

కృష్ణవేణమ్మ వెళ్ళి కుశలప్రశ్న వేసింది. నీరసంగా, ఏనాడో పది సంవత్సరాల పాత సాంగత్య మాతృత్వాన్ని మాసి పోజేసుకున్న మలిన హృదయంతో నవ్వి, జవాబిచ్చాడు. కృష్ణవేణమ్మ తన విషయం అంతా చెప్పింది. అతని స్థితి విని, చిన్ననాటి ప్రేమ చంపుకోలేక వచ్చానంది. ఏనాటికైనా తన కొడుకే అంది. ప్రసాదరావు నీరసంగా నవ్వాడు. నారాయణి ముఖం తీవ్రంగా చూస్తూ, "నీ పెంపుడుకూతుర్ని నామీద పోటీకి తీసుకొచ్చావా? నాకంటె ఈ కూతురే నిన్ను బాగా చూస్తుంది. ఆ ధైర్యం నేను పూర్తిగా చచ్చిపోయాక నీకు కలుగు

తుంది. మీరు ఈ అపవిత్ర గృహంలో ఎందుకు అడుగు పెట్టారూ? ఎంత త్వరగా వెళ్ళిపోతే, అంత తక్కువ పాపం దొరుకుతుంది!" అన్నాడు.

కృష్ణవేణమ్మ అంతకంటె అతన్నుంచి, సమాధానం ఆశించలేదు. నారాయణి అతని దౌర్బల్యాన్ని గుర్తించి, నిట్టూర్పువిడిచింది. సౌదామిని జాగ్రత్తగా కృష్ణవేణమ్మకి నారాయణికి ఏ లోటూ రాకుండా చూస్తోంది. ప్రసాదరావు జీవితంలో ముఖ్య ఘట్టాల్ని చెపుతూ, "అత నిలాంటి వ్యక్తి లేడని నమ్మాను. ఈనాటికి నాకు దురదృష్టం లభించింది. మీరు పెంచిన ఫల మేమిటి?" అన్నది.

కృష్ణవేణమ్మ సౌదామినిని చూచి, ఒక విధంగా జాలిపడివా నిరసన భావం వెన్నంటి జాలిని, చంద్రుణ్ణి రాహువులా మ్రింగేసింది. ప్రసాదరావు సేవలో మళ్ళీ తృప్తి పొందడాని కన్నట్టు, మందులూ అవీ తనే అందిస్తోంది. కాని, సౌదామిని, "మీ కెందుకు శ్రమ? నర్సు లన్నీ చేస్తారుగా!" అంటే, ఇది మాతృత్వనుమ్మా! అని చెపుదామనుకుంది-కాని పరమ రహస్యాన్ని బట్టబయలు చేయడానికి, మనస్కరించలేదు. సర్వ వేదాంతాలసారం, సర్వ ప్రపంచ సాహిత్య సారం, సర్వ మానవ సహకారం, సమస్త సాంఘిక ప్రసారం-ఒక అనుహ్యాతమైన ప్రేమిక ఆభిమానిక శక్తిమీద ఆధారపడి వుంటుంది. ఆ విశ్వవ్యాప్తమైన తరంగాలలో, ఒక్క తరంగం దొరికితే చాలు మానవుడు పవిత్రుడు కావడానికి పునీతుడై జీవించడానికి!

ఆ రహస్యాన్ని తనెందుకు బట్టబయలు చేయాలి?

దిక్కులు అమావాస్య చీకటిలో భయంకరంగా నవ్వుతున్నాయ్! మేఘాలు, ఆకాశ రాజ్యంలో నిగ్రోభటుల్లా గస్తీ తిరుగుతున్నయ్! కాలచ్ఛాయలు, రాక్షస ఘోరకేశాలమల్లే కొట్టుమిట్టాడుతున్నయ్.

రాత్రి పన్నెండుగంటలకి ప్రసాదరావు జబ్బు మంచంమీంచి గట్టిగా కేకవేసి, నేలకొరిగిపోయాడు. ఆకేక భీకరంగా కృష్ణవేణమ్మగుండెల్ని తట్టిలేపింది. ఒక్కుమ్మడి పైకెగిరివెళ్లింది. ప్రసాదరావు క్రింద పడిపోయివున్నాడు. మెల్లగాలేపింది. ఉపచరించగా, పది నిమిషాలకి "ఊ" అన్నాడు.

"ఎలావుంది బాబూ!"

"ఏదీ? ఆ శిఖండి లేదూ? సౌదామిని తిరుగుబోతు-నన్ను మోసం చేసింది. అది సర్కారుతో బాగా తిరుగుతోంది-నా తల్లికి కాకుండా నన్ను చేసింది—"

బాధగా, కోపంగా, రోషంగా, గర్జిస్తూ అన్నాడు. కృష్ణవేణమ్మ అతన్ని ప్రశాంతంగా పడుకోబెట్టి వెళ్లింది. సౌదామిని తిరిగి, తిరిగి రెండు గంటలకి వచ్చింది.

"ఆయన పడిపోయాడు."

"ఆ జబ్బు అంతే! అప్పుడప్పుడూ పడిపోతూ వుంటాడు. అది క్షయలో చేరిన దుర్భరవ్యాధి" అని సౌదామిని తన గదిలోకి విసురుగా వెళ్లిపోయింది.

ప్రసాదరావు హృదయవైశాల్యాన్ని, ఎవరో దుండగీడు ఆక్రమించుకుని సంకుచితత్వాన్ని బలియచేశారు. ఆ మాటే సౌదామిని అంటుంది- "ప్రసాద్ ముసుపటివాడు కాడని, స్వార్థపగ... చస్తోన్న జీవితాన్ని పట్టుకువ్రేళ్లాడుతున్నాడని."

కృష్ణవేణమ్మ చివరిసారి, ప్రసాద్‌ని, చూచి మర్నాడు బయల్దేరింది. నారాయణి ప్రసాద్‌కి నమస్కారం పెట్టింది. ప్రతినమస్కరించాడు ప్రసాద్. ఆ నమస్కారాన్నే నారాయణి, తన అన్న తన కిచ్చిన బహుమానంగా హృదయంలో పదిలంగా దాచుకోవాలనుకుంది.

కృష్ణవేణమ్మని చూస్తూ, "నాకు బ్రతికే ఆశల్లేవు చచ్చిపోతాను. నిశ్చితంగా చచ్చిపోయే అవకాశం నాకీయండి. స్వార్థం, సంకుచితత్వం, కులతత్వం-నాకంటి కేమీ లేవు. నా ఆస్తిని, చచ్చిపోతూ అందరికీ పంచుతాను. అందులో మీ భాగాన్ని నారాయణితో సహా స్వీకరించండి- ఇదేనా చివరికోరిక"- అన్నాడు ప్రసాద్.

కృష్ణవేణమ్మ మాటాడకుండా బండెక్కిపోయింది. నారాయణి దార్లో, "అన్నయ్య సహృదయుడూ, విశాలమైనవాడూనూ" అంది.

కృష్ణవేణమ్మ, ప్రసాదరావు జీవితంలో వైశాల్యానికి తగిన, విలువల్ని వెతకబోతోంటే స్మృతిపథంలో ఏవో మెదులుతున్నయ్! ★